
# 5. అమాయకుడు

కింది బొమ్మను చూడండి, మాట్లాడండి.



## ప్రశ్నలకు జవాబులు చెప్పండి

- బొమ్మను చూడండి. ఎవరెవరున్నారు? వాళ్ళు ఏంచేస్తున్నారు?
- పిల్లలు ఎందుకు నవ్వుతున్నారు?
- గాడిదపై కూర్చున్న వ్యక్తిని చూస్తుంటే మీకేమనిపిస్తున్నది?



## విద్యార్థులకు సూచనలు

- పాఠంలోని బొమ్మలు చూడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులనుగాని, ఉపాధ్యాయులనుగాని అడగండి. లేదా **'పదాలు-అర్థాలు'** అనే పట్టికలో చూసి తెలుసుకోండి.

SCERT TELANGANA

సోము ఉత్త అమాయకుడు. చదువు అబ్బలేదు. తల్లికి సోము గురించే బెంగ. వాడికి కనీసం పనులైనా నేర్పాలనుకున్నది. ఓ రోజు కొడుకును పిలిచింది. “ఇంతకాలం నిన్ను కూర్చోబెట్టి తిండిపెట్టాను. రోజు రోజుకీ నా ఒంట్లో శక్తి తగ్గిపోతోంది. ఏదైనా పనిచేస్తేనే తిండిపెడతాను” అన్నది.

‘అమ్మా! నేను ఇప్పటి నుంచి నిలబడే తింటాలే’ అన్నాడు సోము. కొడుకు అమాయకపు మాటలకు నవ్వుకున్నది. ఈ రోజు నుండి పని చెయ్యాల్సిందే అని పనికి పంపింది.



వడ్ల బస్తాలతో ఆ ఊరి రామయ్య నిలబడ్డాడు. ఎడ్లబండిలోకి బస్తాలను ఎక్కించాలి. ఎవరైనా దొరుకుతారా! అని అటూ ఇటూ చూస్తున్నాడు. ఇంతలో రామయ్యకు సోము కనిపించాడు. ‘ఒరేయ్! సోమూ! గీ బస్తాలు బండ్లో వేస్తావా!’ అని పిలిచాడు. మొత్తం బస్తాలు బండ్లో వేయించుకున్నాడు. ఓ పది రూపాయల నోటు చేతిలో పెట్టాడు. దాన్ని అటూ ఇటూ తిప్పుతూ వదిలేశాడు. అదికాస్తా గాలికి ఎటో ఎగిరిపోయింది. ఇంటికి వచ్చి తల్లికి జరిగిన విషయం చెప్పాడు. ‘ఒరేయ్! అవి డబ్బులురా! ఎవరైనా ఇస్తే జేబులో పెట్టుకొని రావాలి’ అన్నది. సరేనని బుద్ధిగా తల ఊపాడు.



మరునటి రోజు అలా ఊర్లో తిరగసాగాడు. ఓచోట ముసలవ్వ కట్టెలు విరుస్తూ కనబడింది. దగ్గరకు వెళ్ళి ‘అవ్వా!

SCERT TELANGANA

నేను సాయం చెయ్యనా! అన్నాడు. గొడ్డలితో బోలెడన్ని కట్టెలు కొట్టి పెట్టాడు. అవ్వ ఎంతో సంతోషపడింది. 'ఎంత మంచివాడివి నాయనా! ఇదిగో ఈ వెన్నముద్ద తీసుకో. నెయ్యి కాచుకో. కమ్మగా అన్నంలో కలుపుకొని తిను' అన్నది. ఓ దొప్పలో బత్తాయి కాయంత వెన్నముద్ద పెట్టి ఇచ్చింది. సోముకు తల్లి మాటలు గుర్తుకు వచ్చాయి. బయటికి వచ్చిన తర్వాత దొప్ప అవతల పడేశాడు. వెన్నముద్దను జేబులో పెట్టుకున్నాడు. ఇంటికి వచ్చేటప్పుడు బాగా ఎండ ఉంది. ఆ వేడికి వెన్నంతా కరిగింది. చొక్కా నిండా కారిపోయింది. తల్లికి చూపిద్దామనుకునేసరికి కనబడలేదు. జిడ్డు జిడ్డుగా మరకలు తప్ప ఏం మిగల్లేదు.

కొడుకును ఏమనాలో అర్థం కాలేదు. 'ఒరేయ్! ఎట్లారా? నీతో? ఇలాంటివి ఎవరైనా ఇస్తే డబ్బాలో వేసి పట్టుకొని రావాలి' అన్నది. 'సరేనమ్మా!' అన్నాడు.

తర్వాత రోజు పనికోసం తిరుగుతుంటే ఓ ఆసామి చూశాడు. సోమును పిలిచి పనులు చేయించుకున్నాడు. 'ఇదిగో! ఈ కోడిని తీసుకొని వెళ్ళు. మంచిగా పెంచుకో. అది గుడ్లు పెడుతుంది! అన్నాడు. తల్లి చెప్పింది గుర్తొచ్చింది. దాన్ని పట్టుకొని బయటకు వచ్చాడు. తనవెంట తెచ్చుకున్న డబ్బాలో వేశాడు. గట్టిగా మూతపెట్టాడు. తల్లి దగ్గరకొచ్చి సంతోషంగా మూత తెరిచాడు. ఇంకేముంది కోడి ఊపిరాడక చచ్చిపోయింది. కొడుకు నిర్వాకానికి ఏం చేయాలో తోచలేదు. ఎలా చెబితే అర్థమవుతుందో తెలియక తలపట్టుకుంది. వీడికి అందరికి సాయం చేసే గుణం ఉన్నది. కానీ వీడిని ఎవరు బాగుపరుస్తారో! అనుకున్నది. చదువుకుంటే బాగుపడతాడని అనుకున్నది. ఆ ఊరి బడికి తీసుకొని వెళ్ళి బళ్ళో చేర్పించింది.



SCERT TELANGANA

# భాషాసామర్థ్యాల సాధన

## I వినడం-ఆలోచించి మాట్లాడడం

అ) ఈ కథ విని నవ్వుకున్నారు కదా! ఇలా మీకు నవ్వు తెప్పించిన సంఘటనలను చెప్పండి.

ఆ) సోము గురించి విన్న తర్వాత మీకు ఏమనిపించింది? చెప్పండి.

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకోవడం

**అ) పాఠం ఆధారంగా కింది వాక్యాలు తప్పో, ఒప్పో గుర్తించండి.**

1) 'ఏదైనా పనిచేస్తేనే తిండిపెడతాను' అని తల్లి అన్నది. (     )

2) రామయ్య వంద రూపాయల నోటు సోము చేతిలో పెట్టాడు. (     )

3) సోము ఉత్త అమాయకుడు. (     )

4) ముసలవ్వ బత్తాయి కాయంత వెన్నముద్ద దొప్పలో పెట్టి సోముకు ఇచ్చింది. (     )

5) సోమును వాళ్ళమ్మ బడిలో చేర్పించింది. (     )

**ఆ) పాఠం చదువండి. కింది వాక్యాల తర్వాత వచ్చే వాక్యాలను రాయండి.**

1) అమ్మా! నేను ఇప్పటి నుంచి నిలబడే తింటాలే' అన్నాడు సోము.

______________________________

2) గొడ్డలితో బోలెడన్ని కట్టెలు కొట్టిపెట్టాడు.

______________________________

3) తల్లి దగ్గరకొచ్చి సంతోషంగా మూత తెరిచాడు.

______________________________

4) కానీ వీడిని ఎవరు బాగుపరుస్తారో! అనుకున్నది.

______________________________

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## III సొంతంగా రాయడం

అ) కింది ప్రశ్నలకు జవాబులను రాయండి.

1) తల్లి సోముకు పనులెందుకు నేర్పాలనుకున్నది?

2) సోము చేసిన పనుల్లో మీకు బాగా నవ్వు తెప్పించిన ఒక అంశం గురించి సొంతమాటల్లో రాయండి.

3) సోము అమాయకుడేనా? ఎందుకు?

## IV సృజనాత్మకత

అ) అమాయకపు సోము ఏమేమి చేశాడో తెలుసుకున్నారు కదా! బడిలో చేరిన సోము ఎలాంటి అమాయకపు పనులు చేసి ఉంటాడో ఊహించి చెప్పండి. ఏదైనా ఒక దానిని రాయండి.

## V పదజాలం

అ) కింది పదాలతో సొంత వాక్యాలను రాయండి.

1) బెంగ : ____________________

2) డబ్బులు : ____________________

3) గుర్తుకురావడం : ____________________

4) సాయం : ____________________

5) చదువు : ____________________

SCERT TELANGANA

ఆ) కింది పదాలకు బహువచనాలు రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) | కోడి | ________ | 5) | కాయ | ________ |
| 2) | నోటు | ________ | 6) | మరక | ________ |
| 3) | మేక | ________ | 7) | డబ్బా | ________ |
| 4) | ఎద్దు | ________ | 8) | గొడ్డలి | ________ |

## VI భాషను గురించి తెలుసుకుందాం

**అ) కింది పేరాను చదువండి.**

రాము, గోపి, చందన, వనజ, దీపిక, మోషె, రహీం వీరంతా హైదరాబాదులోని జంతు ప్రదర్శనశాల చూడటానికి వచ్చారు. వీరు వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, కొత్తగూడెం ప్రాంతాలకు చెందినవారు. జూపార్క్‌లో పులి, సింహం, ఏనుగు, కుందేలు మొదలైన జంతువులనే కాకుండా చిలుకలు, పావురాలు, నెమలి, వడ్రంగి పిట్ట, పాలపిట్ట వంటి పక్షులను చూశారు. తమతో తెచ్చుకున్న అరటి, జామ, సపోటా, బత్తాయి, యాపిల్ పండ్లను తిన్నారు.

పై పేరాలో ఉన్న వ్యక్తులు, ఊళ్ళు, జంతువులు, పక్షులు, పండ్ల పేర్లు చదివారు కదా! ఇలా పేర్లను తెలిపే వాటిని 'నామవాచకాలు' అంటారు.

పై పేర్లతో పాటుగా మరికొన్ని నామవాచక పదాలను కింది పట్టికలో రాయండి.

| స్నేహితుల పేర్లు | ఊళ్ళ పేర్లు | జంతువుల పేర్లు | పక్షుల పేర్లు | పండ్ల పేర్లు |
|---|---|---|---|---|
| | | | | |

SCERT TELANGANA

## VII ప్రాజెక్టుపని

**మీరు తెలిసిన ఏదైనా హాస్యకథను సేకరించండి. దీనిని రాసి తరగతి గదిలో చదివి వినిపించండి.**



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## నేనివి చేయగలనా?

1) సోము కథను సొంతమాటల్లో చెప్పగలను. ఔను / కాదు

2) పాఠం ఆధారంగా తర్వాత వచ్చే వాక్యాలను రాయగలను. ఔను / కాదు

3) సోము గురించి సొంతమాటల్లో రాయగలను. ఔను / కాదు

4) సోము కథను నాటకీకరణ చేయగలను. ఔను / కాదు

5) ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు, బహువచనాలను రాయగలను. ఔను / కాదు

6) నామవాచక పదాలను గుర్తించగలను, రాయగలను. ఔను / కాదు

## సూక్తి

ఒక మనిషిని అతడు చేసిన పనినిబట్టి అంచనావేయాలి. ఆ పనినిచేయడంలో అతనికి ప్రేరణ ఇచ్చిన ఉద్దేశ్యాన్ని బట్టికాదు.

– మహాత్మాగాంధీ

SCERT TELANGANA

# ఎవరు నేను?

ఎవరునేను? ఎవరునేను?
కొమ్మలతో ఎత్తుగా
రెమ్మలతో గుబురుగా
అవని అంత అలుముకున్న
ఆకు పచ్చదనం నేను

పూల పరిమళాలతో
గాలి చల్లదనంతో
పండ్ల తియ్యదనంతో
ప్రేమగ నే పిలుస్తాను

ఎవరునేను? ఎవరునేను?

పిట్టలు, పురుగులు
పాములు, చీమలు
నా కొమ్మల్లో రెమ్మల్లో
సందుల్లో తొర్రల్లో
గూళ్ళు కట్టుకుంటాయి
గుడ్లు పెట్టుకుంటాయి
పసిపిల్లలు మీరంతా
నా చుట్టూ కూడుతారు

నా నీడలో ఆడుతారు
నా కొమ్మల ఎక్కి ఎక్కి
నా రెమ్మల నక్కి నక్కి
పువ్వులతో పోటీపడి
నవ్వులు చిందిస్తారు
తీయనైన పండ్లుతిని
మురిసి మురిసి పోతరు

గురుతొచ్చానా? పిల్లలూ!
గురుతొచ్చానా?
చెట్టును నేను! - పచ్చని
చెట్టును నేను!
మీ జాతి మనుగడకు,
తొలిమెట్టును నేను!



SCERT TELANGANA